క్లుప్తంగా

ప్రజలకు మరింత చేరువలో ప్రభుత్వ పాలన



మహిళలతో ముఖాముఖి నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : ప్రభుత్వ పాలనను ప్రజలకు మరింత చేరవ చేసేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పలు కార్యక్రమాలు చేపట్టారని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలంలోని భోగాపురం సచివాలయ పరిధిలో నిర్వహించిన మహిళలు, ప్రజలతో ముఖాముఖి, పల్లె నిద్ర కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారు. పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా గ్రామ నాయకులు, కార్యకర్తలతో ప్రత్యేకంగా సమావేశమై, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. పల్లె నిద్ర కార్యక్రమం అనంతరం శనివారం ఉదయం ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి భోగాపురంలో వాడవాడలా పర్యటించారు. అనంతరం ఎమ్మెల్యే నాయకులు, కార్యకర్తలతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అక్షరమాలలో 'స్వచ్ఛతా హీ సేవ'



పెదపాడులో స్వచ్ఛతా హీ సేవ అక్షర క్రమంలో కూర్చున్న గ్రామ సచివాలయ సిబ్బంది

పెదపాడు: ఏలూరు జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ ఆధ్వర్యంలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం వినూత్నంగా నిర్వహించారు. సుమారు 400 మంది సిబ్బంది పంచాయతీ రాజ్ శాఖ, గ్రామ సచివాలయం సిబ్బంది స్వచ్ఛతా హీ సేవ అక్షరమాలలో ఒదిగారు. ఈ కార్యక్రమం శనివారం పెదపాడు మండలం ది.పెదపాడు విశాల సహకార పరపతి సంఘం ప్రాంగణంలో నిర్వహించారు. ఈకార్యక్రమంలో పెదపాడు మండల పంచాయతీ విస్తరణాధికారి సాధనాల సూర్యకుమార్, ఈఓ వినోద్ పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ తోటలను తెగుళ్ల నుంచి రక్షించాలి

దెందులూరు: ఆయిల్ పామ్ తోటలను తెగుళ్ల నుంచి రక్షించాలని అస్సాం, మేఘాలయ, అరుణాచల్‌ప్రదేశ్, కర్ణాటక, తెలంగాణా, త్రిపుర, నాగాలాండ్ రాష్ట్రాలకు చెందిన ఆయిల్‌పామ్ నిపుణులు అన్నారు. శనివారం దెందులూరు మండలం దెందులూరు, సానిగూడెం పామాయిల్ తోటల్లో పతంజలి సంస్థ సీనియర్ మేనేజర్ టీ.మోహన్ ఆధ్వర్యంలో అవగాహన, శిక్షణ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ వీరేంద్రచౌదరి, డీజీఎం రవీంద్ర, పామాయిల్ రైతులు ఉన్నారు.

మనస్తాపంతో వ్యక్తి ఆత్మహత్య

పెదవేగి : భార్య పుట్టింటికి వెళ్లిందన్న మనస్తాపంతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడి మృతి చెందిన ఘటన స్థానికంగా తీవ్ర కలవరాన్ని సృష్టించింది. పెదవేగి ఎస్సై ఎం లక్ష్మణ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెదవేగి మండలం కొప్పులవారిగూడెంకు చెందిన వీరంకి వెంకటేశ్వరరావు, మౌనిక 4 నెలల క్రితం ప్రేమించుకుని పెద్దలకు ఇష్టం లేని వివాహం చేసుకుని రాయన్నపాలెంలో నివసిస్తున్నారు. ఈనెల 22న భార్యాభర్తలు గొడవ పడగా మౌనిక పుట్టింటికి వెళ్లింది. దీంతో మనస్థాపానికి గురైన వెంకటేశ్వరరావు అదే రోజు ఇంటి సమీపంలో ఉన్న గడ్డి మందు తాగాడు. స్నేహితులు, చుట్టుపక్కల వారు అతన్ని ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఈనెల 30న వెంకటేశ్వరరావు(23) మృతి చెందాడు. ఆసుపత్రి నుంచి అందిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శనివారం చెప్పారు.

పెన్షన్ సొమ్ము స్వాహాపై కేసు నమోదు

భీమడోలు: మృతి చెందిన తల్లి బతికి ఉందంటూ ఆమె ప్రభుత్వ పెన్షన్ సొమ్మును బ్యాంకు నుంచి విత్ డ్రా చేసి ట్రెజరీ అధికారులను మోసగించిన ఆమె కుమార్తెపై భీమడోలు పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేసారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఏలూరుకు చెందిన సీహెచ్ ఎన్ఎన్ భూషణ్ అమ్మ గతంలో గుణ్ణంపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో లైబ్రేరియన్‌గా పని చేసి ఉద్యోగ విరమణ చేసింది. అప్పటి నుంచి ఆమె ప్రభుత్వ పెన్షన్ తీసుకుంటోంది. గతేడాది ఆమె మృతి చెందింది. ఆ సమాచారాన్ని ఆమె కుటుంబ సభ్యులు సంబంధిత భీమడోలు ట్రెజరీ అధికారులకు ఇవ్వలేదు. 2022 మార్చి నెల నుంచి ఏడాది పాటు సుమారు రూ.2లక్షల నగదును ఆమె కుమార్తె సూర్య అధికారులను మోసగించి విత్ డ్రా చేసింది. భీమడోలు ఎస్‌టీవో ఎస్.శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదుపై భీమడోలు రైటర్ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షలో నాణ్యమైన వైద్య సేవలు

- కలెక్టర్ ప్రసన్న వెంకటేష్
- గ్రామాల్లో వైద్య శిబిరాలు ప్రారంభం
- రోగులకు వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది సేవలు



భీమడోలు: ఆరోగ్యశ్రీ యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు



గణపవరం: ఆరోగ్యసురక్ష శిబిరంలో రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రశాంతి

భీమడోలు: నాణ్యమైన వైద్య సేవలు ప్రతి ఒక్కరికీ అందాలన్న సంకల్పంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ అన్నారు. సూరప్పగూడెం ఎంపీపీ పాఠశాలలో శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబుతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి మండల ప్రత్యేకాధికారి ఎస్ఎస్‌కే ఖాజావలి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు మాట్లాడుతూ పేదలకు వైద్య సేవలను మరింత చేరువ చేసేలా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్య రంగంలో వినూత్న కార్యక్రమాలను ప్రవేశ పెట్టారన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం 45 రోజుల పాటు ఐదు దశల్లో నిర్వహిస్తామన్నారు. ప్రతి మండలానికి 104 వాహనాన్ని కేటాయించి ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్నామన్నారు. 104 వాహనంలో ఈసీజీ ఏర్పాటు చేసిన గుండెకు సంబంధించిన వైద్య సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలోని విభాగాలను పరిశీలించిన కలెక్టర్, ఎమ్మెల్యేలు అనంతరం అక్కడ ప్రజల కోసం ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్, ల్యాబ్ టెస్టింగ్, వైద్యుల పరీక్షా విభాగాలు, మందుల పంపిణీ కౌంటర్లను, పౌష్టికాహార పదార్థాల స్టాల్‌ను సందర్శించారు. వైద్యుల బృందం డాక్టర్ ఈశ్వర్, సుధాకర్, డాక్టర్ శ్యామ్, బి.లీలాప్రసాద్, కె.శ్రీలక్ష్మీ, తనూజ, ఫణికుమార్‌తో ఆయన చర్చించారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ ఏదైనా ఆరోగ్యసమస్య పెద్దదైతే చికిత్స నిమిత్తం ఆరోగ్య శ్రీ కింద ఎక్కడ వైద్య సేవలు అందుతాయో చికిత్స కోసం అక్కడ ఆరోగ్య కార్యకర్తలు తీసుకుని వెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెజ్జు బాలాజీ, ఎంపీపీ కనమాల రామయ్య, జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ రంగ, ఎఎంసీ చైర్మన్ ఇంజేటి నీలిమజూనియర్, డీఎంహెచ్‌వో ఎస్.శర్మిష్ఠ, డీసీహెచ్ డాక్టర్ పాల్ సతీష్‌కుమార్, ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ రాజీవ్, ఎంపీడీవో సీహెచ్ పద్మావతి దేవి, తహసీల్దార్ ఇందిరాగాంధీ, మండల వైసీపీ కన్వీనర్ రావిపాటి సత్యశ్రీనివాస్, మండల సాగు సలహా సంఘం అధ్యక్షుడు పసుపులేటి సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షతో ఆరోగ్యభద్రత – పశ్చిమగోదావరి కలెక్టరు పి.ప్రశాంతి

గణపవరం: పేద ప్రజలందరికీ నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులో ఉంచాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించిందని, ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు. శనివారం గణపవరం సచివాలయం-2లో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఆమె లాంఛనంగా ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఈకార్యక్రమం ద్వారా ప్రజలందరి ఆరోగ్య వివరాలను నమోదుచేసి అవసరమైన వైద్యసేవలు అందిస్తామన్నారు. అవసరమైన వారందరికీ వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు ఇస్తారని, మెరుగైన వైద్యం అవసరమైన వారిని ఇతర ఆస్పత్రులకు రిఫర్ చేస్తారని చెప్పారు. మెడికల్ క్యాంపు గదులు, కంప్యూటర్ డేటా సెంటర్లను కలెక్టర్ పరిశీలించారు. శిబిరానికి వచ్చిన రోగులతో ఆమె మాట్లాడి, వారి ఆరోగ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నవంబర్ 15వ తేదీలోగా జిల్లాలోని అన్ని సచివాలయాల పరిధిలోనూ వైద్యశిబిరాలు నిర్వహిస్తామని ప్రజలంతా సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు, సీపీవో శ్రీనివాసరావు, వైద్యాధికారులు పులపర్తి సంతోష్, కిరణ్మయి, తహసీల్దార్ పమ్మి లక్ష్మి, ఎంపీడీవో జ్యోతిర్మయి, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్ సీపీ నాయకులు దండు రాము, కాకర్లశ్రీను, కొండేటి వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

ఉంగుటూరు: ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే చేసి రోగులను గుర్తించి వారికి జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా వైద్యసేవలు అందజేసే కార్యక్రమం దేశంలో ఇదే మొదటిదని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శనివారం వెల్లమిల్లి 1 సచివాలయంలో జగనన్న సురక్ష ఆరోగ్య వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సర్పంచి వక్కకుమార్‌రాజ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో వాసుబాబు మాట్లాడుతూ 45 రోజుల పాటు గ్రామాల్లో నిర్వహించనున్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ వైద్యశిబిరంలో 360 మంది రోగులు హాజరయ్యారు. జగనన్న సురక్ష మండల కోఆర్డినేటర్ డా. శ్రావణ రెడ్డి, ఎముకుల వైద్య నిపుణులు డా. క్రాంతి కిరణ్, స్త్రీ వైద్య నిపుణులు డా. షాలిని, పీహెచ్‌సీ డాక్టర్లు వర్మ, డా. పి.మానస, ఆసుపత్రి వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు ఆశాలు ఈ శిబిరంలో వైద్యసేవలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఆంజనేయబాబు, డీటీ బొడ్డేపల్లి ప్రసాదు, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, ఎంపీపీ గంట శ్రీలక్ష్మి, మహిళా విభాగం మండల అధ్యక్షురాలు మంద జయలక్ష్మి, ఉపసర్పంచి నాగు, సొసైటీ అధ్యక్షుడు శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

తోటగూడెంలో ..

పెదపాడు : మండలంలోని తోటగూడెంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని శనివారం ఎంపీపీ బత్తుల రత్నకుమారి, జిల్లా పంచాయతీ అధికారి, మండల ప్రత్యేక అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్‌తో కలిసి ప్రారంభించారు. ఈకార్యక్రమంలో భాగంగా రోగులకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందించారు. అనంతరం జగనన్న ఆరోగ్య కార్యక్రమంలో ఆరోగ్య శాఖ ఏర్పాట్లు పర్యవేక్షించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన డాక్టరు వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్రదర్శన ఆకట్టుకుంది. ఏఎంసీ అధ్యక్షుడు అప్పన ప్రసాద్, జిల్లా రైస్ మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్ చౌదరి తెలిపారు. సర్పంచ్ ఏనుగ అబ్రహం, విజిలెన్స్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు కత్తుల రవికుమార్, స్థానిక నాయకులు గరికపాటి పాండురంగరావు, పెదపాడు తహసీల్దార్ జీ విజయకుమార్ రాజు, ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి, డాక్టరు చక్రధర్, డాక్టరు పాల్, ఎంఈఓ సబ్బితి నర్సింహమూర్తి, సీడీపీఓ ఎం సునీల్ రాజశేఖర్, ఏపీఎం సుమలత, పంచాయతీ కార్యదర్శి పాల్, వీఆర్వో మురళీ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



ఉంగుటూరు : వెల్లమిల్లి జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసుబాబు



ఉంగుటూరు : జగనన్న ఆరోగ్య సురక్షలో రోగులను పరిశీలిస్తున్న వైద్యులు



పెదపాడు: తోటగూడెంలో ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యత

- జగనన్న ఆరోగ్య సురక్ష మరో అధ్యాయం
- ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి
- ముండూరులో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ప్రారంభం



పెదవేగి: ముండూరులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి



దెందులూరు: చల్లచింతలపూడిలో యాజమాన్య భూహక్కు పత్రాలపంపిణీ

పెదవేగి : ప్రజారోగ్యం విషయంలో దేశంలోనే ఆదర్శంగా నిలిచిన ఆంధ్రప్రదేశ్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా మరో నూతన అధ్యాయానికి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ సాధనే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి పెదవేగి మండలం ముండూరులో శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి మాట్లాడుతూ, ప్రజారోగ్యం విషయంలో దేశంలోనే ఆదర్శంగా నిలిచిన ఆంధ్రప్రదేశ్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా మరో నూతన అధ్యాయాన్ని ప్రారంభించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. 45 రోజుల పాటు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. వివిధ సమస్యలతో వైద్యుల వద్దకు వచ్చిన వారిని ఎమ్మెల్యే దగ్గరుండి వైద్యసేవలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ బృందం ఏర్పాటుచేసిన స్టాల్స్‌లోని పౌష్టికాహార పదార్థాలను ఎమ్మెల్యే రుచి చూసి తయారీదారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తాతా రమ్య, మండల పార్టీ ప్రెసిడెంట్ జానంపేట బాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ మేకా లక్ష్మణరావు, దెందులూరు జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు తొత్తడి వేదకుమారి, సర్పంచ్ రాచూరి దేవి,బాలస్వామి, ముండూరు సొసైటీ చైర్‌పర్సన్ చెరుకూరి ప్రసాద్, పెదవేగి సొసైటీ చైర్‌పర్సన్ పెనుమాక వెంకట సుబ్బారావు, ఎంపీటీసీల ఎక్స్‌అఫిషియో మెంబర్ పాకలపాటి ఫిలిప్, స్థానిక నాయకులు బలుసు శేఖర్, పోలేపల్లి వెంకటరత్నంచౌదరి, బలుసు మునికుమార్, కొలుకులూరి నాగేశ్వరరావు, డాక్టర్లు మాధవి, భార్గవి, ప్రత్యూష, ప్రత్యేక వైద్యనిపుణులు మురళీకృష్ణ, ప్రత్యుష, అధికారులు, వైద్యులు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, వలంటీర్లు పాల్గొన్నారు.

ఇంటి ముంగిట్లోనే సకల వైద్యం

దెందులూరు: ప్రతి ఇంట్లో వైద్యసేవలు, పరీక్షలు అందించాలన్న లక్ష్యంతో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. శనివారం చల్లచింతలపూడిలో సర్పంచ్ బైగాని వెంకటేశ్వరమ్మ శ్రీమన్నారాయణ అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ప్రారంభోత్సవం, 39 మంది రైతులకు జలకళ పథకంలో బోరు కిట్ల పంపిణీ, నూతనంగా నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్ ప్రారంభోత్సవం, రైతులకు భూహక్కు పత్రాలు పంపిణీని ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ప్రారంభించారు. తొలుత ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి బీపీ పరీక్షలు చేయించుకుని వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. గ్రామంలో 39 మంది రైతులకు జలకళ పథకంలో ఉచితంగా బోరుసెట్లను ఎమ్మెల్యే అందజేశారు. నూతనంగా నిర్మించిన వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లను సర్పంచ్ బైగాని వెంకటేశ్వరమ్మ, ఎంపీపీ బొమ్మన బోయిన సుమలత, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతంతో కలిసి ప్రారంభోత్సవం చేశారు. అనంతరం భూ యజమానులకు భూ హక్కు పత్రాలను లబ్ధిదారులకు అందించారు. దెందులూరు సెక్టార్ పరిధిలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన గర్భిణీలు, బాలింతలకు ఇచ్చే పౌష్టికాహార స్టాల్‌ను ఎమ్మెల్యే పరిశీలించారు. సెక్టార్ సూపర్‌వైజర్, ఆయాలను అభినందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ దెందులూరు మండలం అధ్యక్షులు కామిరెడ్డి నాని, వైస్ ఎంపీపీలు వేమూరి జితేంద్ర, గొల్ల నాగరాజు, విజయవాడ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయ ట్రస్టు బోర్డు డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, ఉపసర్పంచ్ కమ్మ నాగు, గోపన్నపాలెం సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్, గాలాయగూడెం సర్పంచ్ చిలకా వెంకటసుబ్బారావు, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు యలమర్తి రామకృష్ణ, సీతంపేట సొసైటీ అధ్యక్షులు నల్లూరి వెంకట్రామయ్య (బాబి), సర్పంచులు శనపల్లి రామకృష్ణ (విష్ణు), మెండెం సంతోష్‌కుమార్, జోగన్నపాలెం సొసైటీ అధ్యక్షుడు పాకలపాటి శ్రీనివాసరావు, ఎంపీటీసీ యలమర్తి బాపూజీ, ఏనుగు అంజలి ప్రసాద్, సువ్వా ప్రభుదాసు, వైఎస్సార్ సీపీ నాయకులు సంపంగి వేణుగోపాల్ తిలక్, రామకృష్ణ, ములకాల రామకృష్ణ, చిరంజీవి, కొండపల్లి శ్రీధర్, మండలంలోని నాయకులు, కార్యకర్తలు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

భీమడోలు: సహకార రైతుల సంక్షేమమే ఈ ప్రభుత్వ ధ్యేయమని భీమడోలు సొసైటీ అధ్యక్షుడు రావిపాటి సత్యశ్రీనివాస్ అన్నారు. భీమడోలు సొసైటీ ప్రాంగణం వద్ద శనివారం మహాజన సభ నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్థిక సంవత్సరంలో సొసైటీ ద్వారా రైతులకు అందించిన సేవలపై సొసైటీ ఎండీ రామిశెట్టి రాంబాబు నివేదికను సమావేశంలో వివరించారు. సమావేశానికి సొసైటీ అధ్యక్షుడు సత్యశ్రీనివాస్ అధ్యక్షత వహించారు. మండల సాగు సలహా మండలి చైర్మన్ పసుపులేటి సత్యనారాయణ, సొసైటీ డైరెక్టర్లు సవలం నాని, కిలపర్తి భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పథకాల అమలు



ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి : ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పెదవేగి మండలం భోగాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి అధ్యక్షతన శనివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా అబ్బయ్య చౌదరి ఇంటింటికీ వెళ్లి మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల అమలుపై ఆరాతీశారు. వారి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కారానికి హామీ ఇచ్చారు. గ్రామంలో ఇతర సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకుంటూ వాటిని పరిష్కరించారు. వచ్చే ఎన్నికల్లో తిరిగి వైఎస్సార్‌సీపీకే పట్టం కట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఎంపీపీ తాతా రమ్య, మండల పార్టీ అధ్యక్షుడు జానంపేట బాబు, కొప్పాక సొసైటీ చైర్‌పర్సన్ చల్లగొళ్ళ భూస్వామి, సర్పంచ్ దిమ్మిటి నాగమల్లేశ్వరి, ఉపసర్పంచ్ అబ్బదాసు రూతమ్మ, నాయకులు దిమ్మిటి రమేష్, మరీదు బాలస్వామి, వేగుంట అచ్యుతరావు, నెక్కలపు జగన్‌మోహన్ రావు, కొమ్మిరపు నారాయణ, అబ్బదాసు సుబ్బారావు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు



ఉంగుటూరులో విద్యార్థులకు బస్సు పాసులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

ఉంగుటూరు: నిరుద్యోగ యువతకు ఉపాధి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. శనివారం నారాయణపురం ఎస్ఎ ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో వాసుబాబు మాట్లాడుతూ యువతకు ఉద్యోగాలు పొందేందుకు అవసరమైన నైపుణ్యం నేర్పించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. సభకు అధ్యక్షత వహించిన ప్రిన్సిపాల్ విశ్వేశ్వరావు మాట్లాడుతూ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా స్కిల్ డవలప్‌మెంటు అధికారి సుధాకర్ మాట్లాడుతూ నిరుద్యోగ నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ సెంటర్లను ఏర్పాటు చేస్తోందన్నారు. 16 కంపెనీలు ఈ జాబ్‌మేళాలో పాల్గొన్నాయి. సుమారు 1,500 మంది ఉద్యోగాలు పొందే అవకాశం ఏర్పడిందన్నారు. జేడీఎం పార్థసారధి మాట్లాడుతూ ఆక్వారంగంలో 4 నెలలు శిక్షణ పెదమైనవానిపాలెంలో ఇస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా ఎంప్లాయ్‌మెంటు ఆఫీసరు సి మధుభూషణరావు, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, ఉపసర్పంచి అడపా శ్రీను, నాయకడు బళ్ల త్రిమూర్తులు, పంచాయతీ రాజ్ జిల్లా అధ్యక్షుడు పుప్పాల గోపి, ఎంపీటీసీ సభ్యులు బండారు నాగరాజు పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి నిరుద్యోగులు ఈ జాబ్ మేళాకు హాజరయ్యారు.

విద్యార్థులకు బస్సు పాస్‌లు పంపిణీ

ఉంగుటూరు హైస్కూల్లో 121 మంది విద్యార్థులకు ఉచిత బస్సు పాసులను ఎమ్మెల్యే వాసుబాబు శనివారం పంపిణీ చేశారు. బస్సుపాసుల పంపిణీకి ఆర్థిక సహకారం అందజేసిన ఎంపీటీసీ పెనుగొండ బాలకృష్ణను శాలువాకప్పి ఎమ్మెల్యే వాసుబాబు, డిపో మేనేజరు మూర్తి సత్కరించారు.కార్యక్రమంలో సందక రాంబాబు, ఎంఈవో శ్రీనివాసరావు, ఆర్టీసీ పీఆర్వో దొంతల విజయకుమార్, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం

ఉంగుటూరు రైల్వేగేటు వద్ద ఉన్న మదర్ థెరిస్సా ఆటో యూనియన్ సభ్యులు ఎమ్మెల్యే వాసుబాబుతో కలిసి శనివారం సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. వాహన మిత్ర పథకం ఆటో కార్మికులకు ఎంతో ఉపయోగపడుతోందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో ఆటోయూనియన్ నాయకుడు కోరాడశివ, మహిళా విభాగం అధ్యక్షురాలు మందా జయలక్ష్మి, సొసైటీ అధ్యక్షుడు పాపారావు బాబ్జీ, ఆటోయూనియన్ నాయకులు, డ్రైవర్లు, ఓనర్లు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికుల కృషితో ఆరోగ్యకర సమాజం



గణపవరంలో పారిశుధ్య కార్మికులతో కలిసి కాఫీ తాగుతున్న కలెక్టరు ప్రశాంతి

గణపవరం: ఆరోగ్యవంతమైన, ఆహ్లాదకరమైన సమాజాన్ని స్థాపించడంలో పారిశుధ్య కార్మికుల పాత్ర మహోన్నతమైనదని పశ్చిమగోదావరి జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు. శనివారం గణపవరం చెత్త సంపద కేంద్రం వద్ద పారిశుధ్య కార్మికులతో కలిసి కాఫీ విత్ క్లాప్స్ కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మనందరి ఆరోగ్యం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న పారిశుధ్య కార్మికుల అభ్యున్నతికి ప్రభుత్వంతో పాటు ప్రజలూ చేయూత నివ్వాలని పిలుపు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె పారిశుధ్య కార్మికులతో కాసేపు ముచ్చటించారు. పారిశుధ్య కార్మికులను కలెక్టరు పూలమాలలు వేసి శాలువా కప్పి సన్మానించి, మెమోంటోలు, నూతన వస్త్రాలు బహూకరించారు. వారికి యూనిఫారం, కిట్లు అందజేశారు. వారికి కలెక్టరు ప్రశాంతి స్వయంగా కాఫీ అందజేసి వారితో కలిసి కాఫీ తాగారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సూర్యబలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, ఎంపీపీ అర్ధవరం రాము, జెడ్పీటీసీ సభ్యురాలు దేవారపు సోమలక్ష్మి, వైస్ ఎంపీపీ సలాది రత్నకుమారి, సర్పంచ్ మూర అలంకారం, జిల్లా పంచాయతీ అధికారి జి.మల్లికార్జునరావు, సీపీబీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ పమ్మి లక్ష్మి, ఎంపీడీవో జ్యోతిర్మయి, పంచాయతీ కార్యదర్శి డీఎస్ఆర్ ప్రసాద్, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము, వైసీపీ నాయకులు కాకర్ల శ్రీను, రొంగల శ్రీను, కొండేటి వెంకటరత్నం పాల్గొన్నారు.

నారాయణపురం సొసైటీ లాభం రూ.1.65 కోట్లు

ఉంగుటూరు: ఏడాది కాలంలో నారాయణపురం ది విశాల పరపతి సహకారం సంఘం రూ.1.65 కోట్ల లాభాలు ఆర్జించిందని అధ్యక్షుడు యెలిశెట్టి పాపారావు బాబ్జి వెల్లడించారు. శనివారం మధ్యాహ్నం సొసైటీ సమావేశపు హాలులో సర్వసభ్య సమావేశం బాబ్జి అధ్యక్షతన నిర్వహించారు. డైరెక్టర్లు దాసరి సత్యనారాయణ, సురేఏడుకొండలు, ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ కొరిపల్లి జయలక్ష్మి పాల్గొన్నారు. నివేదికను కార్యదర్శి యర్రా శ్రీనివాసరావు చదివి వినిపించారు.

నేడు వైఎస్సార్‌సీపీ ముఖ్య నేతల సమావేశం

పెదవేగి : దెందులూరు నియోజకవర్గ ముఖ్య నాయకులు, కార్యకర్తలతో మ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అధ్యక్షతన ఆదివారం సాయంత్రం 4 గంటలకు పెదవేగి మండలం కొండలరావుపాలెం క్యాంపు కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి జానంపేట బాబు చెప్పారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

సీనియర్ అసిస్టెంట్‌కు భూసర్వే డీటీగా పదోన్నతి

దెందులూరు: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఎం.హరిప్రసాద్‌కు రాజమండ్రి భూసర్వే డిప్యూటీ తహసీల్దార్‌గా పదోన్నతి లభించింది. దీనిపై కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ లిఖిత పూర్వక ఆదేశాలు జారీ చేశారు. శనివారం తహసీల్దార్ ఎన్‌వీ నాంచారయ్య, డిప్యూటీ తహసీల్దార్ ప్రియదర్శిని, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, వీఆర్‌ఓలు ఆయనను అభినందించారు.